సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



ఎస్‌ఈబీ దాడులు

చింతలపూడి: నాగిరెడ్డిగూడెం, నామవరంలో దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సాయి స్వరూప్ తెలిపారు.



శివయ్యకు రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.



విశేష అలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం మావుళ్లమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ఎస్.కార్తికేయశర్మ గజమాల సమర్పించారు.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



సాక్షి, భీమవరం : రాష్ట్ర ప్రజలకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

గూడెంలో భారీ వర్షం



తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 1.08 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది.

పోలీస్ స్పందనలో 14 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పాల్గొని 14 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో కట్నం వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ తగాదాలపై ఫిర్యాదులు ఉన్నాయి. వీటిని సత్వరమే విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఎస్పీ రవిప్రకాష్ ఫోన్‌లో పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

కవి ప్రసాద్‌కు జాతీయస్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవి ప్రసాద్

తణుకు: అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం పోటీల్లో తణుకుకి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్ ప్రతిభ చూపారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 410 మంది కవులు పాల్గొనగా వీరిలో 20 మందిని ఎంపిక చేశారు. సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా ప్రసాద్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. నిర్వాహకులు వడ్డి సుధాకర్, అధ్యక్షురాలు చిట్టే లత, డి.నరేష్, గెడిదం అశోక్ తదితరులు ప్రసాద్‌ను అభినందించారు.

నావెల్ బేస్ ఏర్పాటుకు సన్నాహాలు: ఎంపీ కోటగిరి

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి మండలంలో నావెల్ బేస్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఫెన్స్ శాఖ వైజాగ్‌కు సంబంధించిన నావెల్‌బేస్ సరిపోవడం లేదని, బ్యాకప్‌గా మరో బేస్ తయారు చేసుకోవాలనే ఉద్దేశంలో ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి నావెల్ బృందాన్ని ఆహ్వానించి పరిశీలన చేయించామన్నారు. నావెల్ అధికారులు రెండు సార్లు ఇక్కడ పర్యటించి మన ప్రాంతాన్ని ఎంపిక చేశారన్నారు. త్వరలో నావెల్ బేస్ ఇక్కడ ఏర్పాటుచేస్తారని, ప్రస్తుతం పేపర్ వర్క్ జరుగుతుందని చెప్పారు. ఇది భారీ ప్రాజెక్టు అని, దీనికి 1,300 ఎకరాలు అవసరం ఉందన్నారు. బేస్ ఏర్పడితే 1,000 మంది అధికారులు ఇక్కడ శాశ్వతంగా పనిచేస్తారన్నారు. నావెల్ శిక్షణ, కార్యకలాపాలు జరుగుతాయన్నారు. స్థిరకాలపు మంచి ప్రాజెక్టు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా ముంపు గ్రామాల బాధితులకు మంచి అవకాశం అన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తి.. గ్రామ స్వరాజ్య దీప్తి

బాపూజీ కలలను సాకారం చేస్తున్న సీఎం జగన్

బాపూజీ కలలగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోంది. ప్రజల వద్దకే పాలన చేరువయ్యింది. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్‌ల ఆశయ సాధనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి.

- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు పాలన చేరువ
- విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ఇంటింటా సంక్షేమ కాంతులు

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. విద్య, వైద్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, పేదలకు ఇళ్లు ఇలా అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేస్తున్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. అలాగే గ్రామాల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణతో పనులు చేపడుతున్నారు.

ఇళ్లు.. ఆనందాల లోగిళ్లు

జిల్లాలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి 20 మండలాల్లో 72 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులను ప్రోత్సహిస్తోంది. జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. ఇప్పటికే సుమారు 25 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా 40 వేలకు పైగా ఇళ్లు పలు దశల్లో ఉన్నాయి. ఉచితంగా స్థలం అందించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం అందిస్తోంది. అలాగే డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేల రుణం ఇప్పిస్తున్నారు.

అన్నదాతలకు అండగా..

వ్యవసాయం పండుగ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా వంటి పథకాలతో రైతులకు మేలు చేస్తోంది. జిల్లాలో 409 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే అందిస్తోంది. అలాగే రాయితీపై యంత్ర పరికరాలు సమకూరుస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో రూ.11.55 కోట్ల సబ్సిడీని వ్యవసాయ యంత్రాలకు అందించింది. అలాగే 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతు పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, సకాలంలో ధాన్యం సొమ్ములు అందిస్తోంది.



గొరగనమూడి గ్రామ సచివాలయం

535 సచివాలయాలు

జిల్లాలో పాలనను ప్రజలకు చేరువ చేయడానికి 403 గ్రామ, 132 వార్డు సచివాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా ప్రజల ఇంటి వద్దకే పథకాల లబ్ధిని వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. దీంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది.

పల్లె ముంగిట ప్రభుత్వ వైద్యం

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాల ద్వారా అత్యవసర, ఉచిత వైద్యం అందిస్తుండగా పేదల ఇంటికే వైద్యులు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసేలా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. అలాగే పల్లెల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి స్థానికంగానే వైద్యం అందిస్తున్నారు.

పేదలకు కార్పొరేట్ చదువులు

పేదలకు కార్పొరేట్ తరహా విద్య అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. నాడు–నేడులో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తోంది. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, జగనన్న గోరుముద్ద పథకాలతో పేదలను ఆదుకుంటోంది. జిల్లాలో 1,350 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1.20 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రభుత్వం చేరువచేసింది.

జిల్లాల పునర్విభజన

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం జిల్లాలను పునర్విభజించింది. భీమవరం కేంద్రంగా ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు, 20 మండలాలు, 14,42,471 మంది ఓటర్లు, 1,454 పోలింగ్ కేంద్రాలతో పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడింది.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. డ్వాక్రా రుణమాఫీతో పాటు సున్నావడ్డీ రుణాలు అందిస్తున్నారు. నాకు సున్నావడ్డీ కింది నాలుగు విడతల్లో ఇప్పటివరకు రూ.10,216 లబ్ధి చేకూరింది.

–కర్రి నాగమణి, పెనుగొండ

సొంతింటి కల సాకారం



ప్రభుత్వమిచ్చిన ఇంటి స్థలంలో నేను ఇల్లు కట్టుకుని 7 నెలల క్రితం గృహప్రవేశం చేశాను. నా సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేసింది. సుమారు రూ.3 లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా అందించారు.

– బాలం భాగ్యలక్ష్మి, విస్సాకోడేరు లేవుట్

సత్వరమే రేషన్ కార్డు



జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే నాకు రేషన్ కార్డు వచ్చింది. గతంలో రేషన్ కార్డు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు సత్వరమే ఇస్తున్నారు.

– కటికితల వసంత కుమార్, ఏలూరుపాడు, కాళ్ల మండలం

పవర్ టిల్లర్ పొందాను



గతేడాది వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పవర్ టిల్లర్, రోటోవేటర్స్‌ను సబ్సిడీపై పొందాను. పవర్ టిల్లర్‌పై రూ.70 వేలు, రోటేవేటర్‌పై రూ.33 వేల రాయితీ వచ్చింది.

– భూపతిరాజు రంగరాజు, రైతు, విస్సాకోడేరు

మదినిండా.. జాతీయ జెండా



ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం ఆకివీడు మండలం సిద్ధాపురంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 500 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టి మానవహార ప్రదర్శన నిర్వహించారు. సమర యోధులు, దేశ నాయకుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

– ఆకివీడు

స్పందన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, అర్జీదారులు సంతృప్తి పొందే స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో 206 దరఖాస్తులు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

- తమ తండ్రి బిళ్ల కృష్ణమూర్తి స్వాతంత్య్ర సమర యోధులని ఆయనకు ప్రభుత్వం ఇచ్చిన 4.75 ఎకరాల భూమి ఆక్రమణలో ఉందని, అలాగే ఆయన విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, తమ కుటుంబంలో ఇద్దరు ఆడ పిల్లలకు ఉద్యోగం ఇప్పించాలని నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన బిళ్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి, బిళ్ల నరసింహారావు జేసీని కోరారు.
- మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావు తన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన గుబ్బల వరలక్ష్మి తన కొడుకు తనను ఇంట్లోంచి గెంటేశాడని, తిరిగి తన ఇల్లు తనకు ఇప్పించాలని కోరింది.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సింగులూరికి ఇండియన్ పోలీస్ మెడల్



సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఎస్పీ, ఉమ్మడి పశ్చిమ

ఏలూరు టౌన్: అత్యుత్తమ సేవలందించిన విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. స్వాతంత్య్ర దిన వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న ఆయా శాఖల్లో ఉత్తమ సేవలందించిన పోలీస్ సిబ్బందిని ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేయగా విజిలెన్స్ డీఎస్పీకి స్థానం దక్కటం విశేషం. 2020లో ఆయన డీఎస్పీగా పదోన్నతి పొందగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వగ్రామం ఆకివీడు మండలం అజ్జమూరు కాగా తండ్రి అంజియ్య, తల్లి సీతారత్నం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి కనబర్చారు. 1991 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. అనంతరం కృష్ణా జిల్లా వత్సావాయి, మండవల్లి, పెడన, కలిదిండి తదితర స్టేషన్లలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. 2008లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్వరరావు కాకినాడ ట్రాఫిక్, రాజమహేంద్రవరంలో విజిలెన్స్‌లో పనిచేశారు. ఏసీబీ, విజిలెన్స్‌లో పనిచేస్తూ వృత్తిపై నిబద్ధత, అవినీతి, అక్రమార్కులపై దాడులు చేయటంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక కావటంపై డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన అదృష్టంగా భావిస్తున్నాననీ, ఇలాంటి గౌరవం దక్కటం సంతోషంగా ఉందన్నారు. తన బాధ్యత మరింత పెరిగిందనీ, సమర్థవంతంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మరింత పేరు తీసుకువస్తానని ఆయన చెప్పారు.

పక్కాగా పోలింగ్‌కు ఏర్పాట్లు

ఉండి: జిల్లాలో ఈనెల 19న జరుగనున్న పంచాయతీ ఉప ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలో కలిసిపూడి పంచాయతీలో సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ జరిగే అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎక్కడా అసౌకర్యం, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, ఎన్నికల జిల్లా నోడల్ అధికారి ఎస్‌వీఎస్ శివప్రసాద్‌యాదవ్, ఎంపీడీఓ ఏవీ అప్పారావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు పాల్గొన్నారు.

అమరవీరులు చిరస్మరణీయులు

కలెక్టర్ పి.ప్రశాంతి

ఆకివీడు: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు చిరస్మరణీయులని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆకివీడు శాంతినగర్‌కు చెందిన వీర జవాన్ గంట్లా వీర వెంకట నాగ గోవర్ధన్ తల్లిదండ్రులు వెంకట్రావు, వెంకటలక్ష్మిను కలెక్టర్ సత్కరించారు. గోవర్ధన్ చిత్రపటం వద్ద అంజలి ఘటించి ప్రధాని మోదీ సందేశంతో కూడిన మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరమాతల రుణం తీర్చుకోలేనిదన్నారు. దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సైనికుల త్యాగం ఎనలేనిదన్నారు. డీపీఓ జీవీకే మల్లిఖార్జునరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ దొడ్డి జగదీష్, కమిషనర్ జి.కృష్ణమోహన్, సైనికుల వెల్ఫేర్ అధికారి కె.ప్రసాదరావు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ కె.వాణి, ఎంఈఓ రవీంద్ర పాల్గొన్నారు.



అమరవీరుడు గోవర్ధన్ తల్లిదండ్రుల్ని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

- కలెక్టరేట్ ఆవరణలో సంబరాలు
- 11 శకటాల ప్రదర్శన
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాల అందజేత

భీమవరం(ప్రకాశం చౌక్): స్వాతంత్య్ర దినోత్సవాలకు భీమవరం కలెక్టరేట్ ముస్తాబైంది. కలెక్టరేట్ పక్కనున్న ప్రదేశంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. జెండా ఆవిష్కరణ, ముఖ్య అతిథులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కూర్చోవడానికి వేదికలు సిద్ధం చేశారు. పోలీసులు, ఎన్‌సీసీ కేడెట్స్ గౌరవ వందనం, కవాతులకు ట్రాక్‌లు నిర్మించారు. ఆయా శాఖలకు సంబంధించి స్టాల్స్, శకటాలు ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలకు ఏర్పాట్లు జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి జెండా ఎగురవేస్తారు.

16 స్టాల్స్ ఏర్పాటు

జిల్లాల్లోని పలు శాఖలకు చెందిన 16 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. పీడీ, డీఆర్‌డీఏ, ఈడీ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్, ఏడీ డిఫరెంట్లీ ఏబుల్డ్, ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్స్, ఐసీడీఎస్, మెప్మా, ఫిషరీస్, ఎంఐజీ, స్కిల్ డెవలప్‌మెంట్, బ్యాంకుల తదితర స్టాల్స్ ఆకట్టుకోనున్నాయి.

ప్రగతి శకటాలు

వేడుకల్లో 11 శకటాలను ప్రదర్శించనున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఈడీ ఎస్సీ అండ్ బీసీ కార్పొరేషన్ శాఖ, హౌసింగ్, పశు సంవర్ధక శాఖ, అర్బన్ హెల్త్ క్లినిక్ అండ్ ఫ్యామిలీ ఫిజిషియన్, అగ్రికల్చర్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, విలేజ్ సెక్రటేరియట్, డ్వామా, ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆర్‌డబ్ల్యూఎస్, హార్టీకల్చర్, జగనన్న సురక్ష, జీజీఎంపీ, రీ సర్వే, పంచాయతీరాజ్, అర్బన్ రీ సర్వే తదితర శాఖల శకటాలు ముస్తాబయ్యాయి.

ప్రతిభకు పురస్కారం

జిల్లాలో ఆయా శాఖల నుంచి ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజా, కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తారు. అలాగే పోలీస్ శాఖకు సంబంధించి 8 సేవా పతకాలు కూడా అందించనున్నారు.



కాంతులీనుతున్న కలెక్టరేట్



నవరత్నాల శకటం

ఘనంగా ఏర్పాట్లు



77వ స్వాతంత్య్ర దినోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశాం. ఈ మేరకు సర్వం సిద్ధమైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా శాఖల ప్రగతిని తెలియచేస్తూ శకటాలు, స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నాం. జిల్లా ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు.

–పి.ప్రశాంతి, కలెక్టర్

18 వార్డులు ఏకగ్రీవం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మూడు సర్పంచ్, 28 వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను డీపీఓ జీవీకే మల్లికార్జునరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల పంచాయతీ సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కాగా ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి పోలింగ్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అలాగే 18 వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం కాగా 10 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, పెనుగొండ మండలం దొంగరావిపాలెం, ఇరగవరం మండలం గోటేరు, పెనుమంట్ర మండలం మార్టేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం గోరింటాడ, చింతపర్రు, పెంటపాడు మండలం కస్పా పెంటపాడు, గణపవరంలో ఈనెల 19న పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓటింగ్ నిర్వహిస్తామని వివరించారు.

క్లుప్తంగా

18న నిడదవోలులో ఉమ్మడి జిల్లా యోగా పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యోగా అసోసియేషన్, నిడదవోలు రోటరీ క్లబ్ ఆఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్, జూనియర్, అండ్ సీనియర్స్ యోగాసన పోటీలు నిడదవోలు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ఆర్కే వర్మ వెల్లడించారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ యోగా పోటీలు బాల బాలికలకు వేర్వేరుగా జరుగుతాయని తెలిపారు. మొదటి నాలుగు స్థానాలు సాధించిన క్రీడాకారులు జిల్లా తరపున సెప్టెంబర్ 9, 10 తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్ర యోగా పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. నిడదవోలులో జరిగే పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. యోగా పోటీలలో పాల్గొనే వారికి యోగ మిత్ర మండలి తరపున భోజన వసతి కల్పిస్తున్నామని, మరన్ని వివరాలకు జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ 94408 67370ను సంప్రదించాలని కోరారు.

వచ్చే నెలలో ఫిషరీస్ తరగతులు

- రాష్ట్రంలోనే నర్సాపురంలో మొదటి ఆక్వా యూనివర్సిటీ
- నిపుణుల కొరత అధిగమించేందుకు వర్సిటీ ఏర్పాటు
- 60 సీట్లతో ఈ ఏడాది నుంచి కళాశాల ప్రారంభం

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఆక్వా రంగంలో నిపుణుల కొరతను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలిసారి ఆక్వా హబ్‌గా వెలుగొందుతున్న నర్సాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.330 కోట్లతో 40 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి పనులు నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. నర్సాపురం మండలంలోని లక్ష్మణేశ్వరంలోని ప్రభుత్వ భవనంలో ఆంధ్రా మత్స్య విశ్వవిద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయడంతో పాటు 60 గ్రాడ్యుయేషన్ సీట్లతో వచ్చే నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

డాలర్ల వర్షం కురిపించే ఆక్వాకు సాంకేతికత, నిపుణుల కొరత వెంటాడుతుంది. నిష్ణాతులైన గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఈ రంగంలో లేకపోవడంతో పుష్కలంగా అవకాశాలున్నా, స్థానిక యువత అందిపుచ్చుకోలేని పరిస్థితి. దీన్ని అధిగమించడానికి గతేడాది నవంబరులో మత్స్య విశ్వవిద్యాలయాన్ని నర్సాపురంలోని సరిపల్లి–లిఖితపూడి గ్రామాల మధ్య ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దేశంలోనే మూడో మత్స్య విశ్వవిద్యాలయంగా, రాష్ట్రంలో మొదటిదిగా నిలిచింది. 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.330 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి మొదటి దశ పనులకు రూ.100 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పరిపాలనా భవనాల నిర్మాణం పూర్తయితే అక్కడ వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.



ఫిషరీస్ యూనివర్సిటీ నమూనా భవనం



వేగంగా సాగుతున్న యూనివర్సిటీ భవనం పనులు



తాత్కాలిక యూనివర్సిటీ భవనం

లక్ష్మణేశ్వరంలో తాత్కాలికంగా వర్సిటీ

యూనివర్సిటీ కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రత్యేకాధికారిగా ప్రొఫెసర్ ఓగిరాల సుధాకర్‌ను నియమించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న లక్ష్మణేశ్వరంలోని ప్రభుత్వ భవనంలో యూనివర్సిటీ, మత్స్యకళాశాల రెండు ప్రారంభమయ్యాయి. మొదటి ఏడాది 60 బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్‌సీ) సీట్లతో ఈ ఏడాది సెప్టెంబర్ రెండో వారం నుంచి కళాశాల ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రభుత్వం 140 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసింది. నర్సాపురం కళాశాలకు 75 పోస్టులు, యూనివర్సిటీ హెడ్ ఆఫీస్‌కు 60 పోస్టులు కేటాయించారు. డీన్, అసోసియేట్ డీన్ కాకుండా మరో 12 మంది టీచింగ్ స్టాఫ్, 10 నాన్ టీచింగ్ స్టాఫ్‌తో కళాశాల ప్రారంభమైంది.

సెప్టెంబర్ రెండోవారం నుంచి తరగతులు

బీఎఫ్ఎస్‌సీ కోర్సులో చేరడానికి ఎంసెట్ కౌన్సెలింగ్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం వెబ్‌ఆప్షన్లు పూర్తయితే ఎడిటింగ్ ఆప్షన్ ఇచ్చారు. ఈ నెలాఖరు నాటికి కౌన్సిలింగ్ ప్రక్రియలో సీట్లు కేటాయించి సెప్టెంబర్ రెండో వారం నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్‌సీ గ్రాడ్యుయేషన్ కోర్సు ప్రారంభించనున్నారు. నాలుగేళ్ళ కోర్సులో 8 సెమిస్టర్లు ఉంటాయి. 6 సెమిస్టర్లలో కోర్సు పూర్తి చేస్తే చివరి రెండు సెమిస్టర్లలో ఫీల్డ్ విజిట్లు, స్టడీ టూర్లు, ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ ఉంటాయి. కోర్సు పూర్తయిన వారికి నూరు శాతం ఉపాధి అవకాశాలున్నాయి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులవుతారు. వివిధ బ్యాంకుల్లో స్పెషలాఫీసర్, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డులో పోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాడిష్ వాటర్ ఆక్వా కల్చర్ తదితర ప్రభుత్వ సంబంధ శాఖల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

వచ్చే ఏడాది నుంచి మాస్టర్ కోర్సులు ప్రారంభిస్తాం



నరసాపురంలో పిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ఈ విద్యాసంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్ కోర్సులో 60 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మాస్టర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్ అలాగే పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభమవుతాయి. అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ ప్రక్రియ కూడా జరుగుతుంది. వచ్చే ఏడాది సొంత భవనంలో తరగతులు నడుస్తాయి.

ప్రొఫెసర్ ఓగిరాల సుధాకర్, యూనివర్సిటీ ప్రత్యేక అధికారి

మత్స్య ఉత్పత్తులు పెరుగుతాయి



ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహం చాలా అవసరం. ఆక్వా రంగ నిపుణుల్ని తయారు చేసుకుని, సాగులో నైపుణ్యాలు పెంచుకుంటే ఆక్వా సాగులో నష్టాలు తగ్గుతాయి. ప్రభుత్వం జిల్లాలో ఆక్వా, మత్స్య రంగాలను ఎలా అభివృద్ధి చేయాలని పరితపిస్తోంది. ఇందులో భాగంగానే దేశంలో మూడవదిగా, రాష్ట్రంలో మొదటిగా అంతర్జాతీయ ఫిషరీష్ యూనివర్సిటీ నరసాపురంలో ఏర్పాటైంది.

ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

విద్యుత్ బిల్లులు చెల్లించాలని వచ్చే మెసేజ్‌లు నమ్మొద్దు

ఉండి: విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ కొందరు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింక్‌లు నమ్మి మోసపోవడద్దని భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉండి మండలం పెదపుల్లేరులో జరిగిన ఓ సైబర్ మోసాన్ని ఉదహరించారు. కరెంట్ బిల్లులు చెల్లించాలని.. లేదంటే కరెంట్ కట్ చేస్తామంటూ వచ్చే మెసేజ్‌లు, ఆన్‌లైన లింకుల్ని నమ్మొద్దన్నారు. వారు పంపించే ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి మోసపోవద్దని తెలిపారు. వినియోగదారులు ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గాని ఫోన్‌పే, గూగుల్ పే, పేటీయం, మీసేవా ద్వారా గాని లేదా కరెంట్ ఆఫీసు వద్ద ఉండే ఈఆర్‌ఓ కౌంటర్‌లో బిల్లులు చెల్లించాలన్నారు. కరెంట్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ శాఖ ఎలాంటి ఆన్‌లైన్ లింక్‌లను పంపించదని ఫోన్ చేయమని కోరదని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు.

రావి ఆకులో మహాత్మా గాంధీ



రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతిని చెక్కిన విద్యార్థులు

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతిని చెక్కి ఔరా అనిపించారు. స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు రావి ఆకులో మహాత్మా గాంధీ, నెమలి, పులి, నెహ్రూ, అంబేద్కర్, బడికి పోదాం, బాలికను కాపాడుదాం ఇలాంటి అనేక కళాకృతులను చెక్కి తమ ప్రతిభను చాటుతున్నారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ప్రోత్సాహంతో తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు లీఫ్ ఆర్ట్‌పై శిక్షణ ఇస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు.

శెట్టిబలిజల హక్కుల సాధనకు పోరాడుదాం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాల శెట్టిబలిజ సంక్షేమ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి ప్రయోజనాల కోసం, జాతి హక్కుల సాధన కోసం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఏర్పడిందన్నారు. సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్య, వైద్యం వంటి విషయాల్లో అవసరమైన వారికి అండగా ఉంటామన్నారు. సంఘం తరపున సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి సంఘ ప్రయోజనాల కోసం వినియోగిస్తామన్నారు. జిల్లా బీసీ సంఘం నేత కోడే యుగంధర్ కోడే వీరమ్మ సేవాసమితి ద్వారా రూ.50 వేలు విరాళం ప్రకటించడం అభినందనీయమన్నారు. త్వరలోనే పెద్ద ఎత్తున పాలకొల్లులో శెట్టిబలిజ మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. బీసీ నాయకుడు వాసర్ల ముత్యాలరావు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధన కోసం శెట్టిబలిజ యువత పని చేయాలన్నారు. ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాటం చేద్దామన్నారు. కోడే యుగంధర్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా పదవులు ఇస్తున్నారంటే అది మన జాతి బలాన్ని చూసే అని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు జోగి పండు మాట్లాడుతూ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు స్థానాలు గెలిచే సత్తా మనకు ఉందన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి అందరూ సిద్ధమవ్వాలని అన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు పాలా రాంబాబు, నాయకులు కొరు శివకృష్ణ, బొక్కా శ్రీను, గూడూరి హనుమంతరావు, కోడి సతీష్, కాలా వెంకట్, మామిడిశెట్టి రవి, కడలి ధర్మారావు, డివిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా సమావేశ దృశ్యం

ఫెన్సింగ్ పోటీల ఓవరాల్ చాంపియన్‌గా పశ్చిమ



ఫెన్సింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు తదితరులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్–20 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా గెలుచుకుందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సత్యనారాయణరాజు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల విజేతలకు అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలు వెల్లడిస్తూ.. మూడు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఫాయిల్ బాలికల విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన తనుజ ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ, తృతీయ స్థానాలను కె.ప్రణీత, పుష్పాంజలి(గుంటూరు) గెల్చుకున్నారన్నారు. ఫాయిల్ బాలికల విభాగంలో పీటీవైటీ సాయిరాజ్(వెస్ట్ గోదావరి) ప్రథమ స్థానంలో నిలవగా.. హెచ్ సువర్ణరాజు ద్వితీయ, ఏఎల్ వెంకటేష్ తృతీయ (గుంటూరు)స్థానాల్లో నిలిచారు. ఎప్పే బాలికల విభాగంలో పీకే నమ్రత (ప్రకాశం) ప్రథమ, ఎల్ శ్రీజ (పశ్చిమ గోదావరి) ద్వితీయ, ఎం.ధనుష్యసాయి(విజయనగరం) తృతీయ స్థానం దక్కించుకున్నారు. బాలుర విభాగంలో మఫ్లజ్ (అనంతపురం) ప్రథమ, అనీష్ వర్మ(పశ్చిమ) ద్వితీయ, ఎస్ మురళీకృష్ణ (శ్రీకాకుళం) తృతీయ స్థానం దక్కించుకున్నారు. సబ్రి బాలికల విభాగంలో ఎం.బేబీరెడ్డి (కడప) ప్రథమ, వై.లక్ష్మీలావణ్య (పశ్చిమ) ద్వితీయ, బి.రవిత్రివేణి (అనంతపురం) తృతీయ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో ఏఎస్ఎన్ పాండు (తూర్పుగోదావరి) ప్రథమ, బి.రాము (తూర్పుగోదావరి) ద్వితీయ, ఎం.గీతానాథ్ (కర్నూల్) తృతీయ స్థానం సాధించారు. విజేతలు సెప్టెంబర్‌లో గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ మోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతి రాజు, ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడి



పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల ఎరువుల దుకాణంలో స్వాధీనం చేసుకున్న ఎరువులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాలలో శ్రీ దుర్గా శ్రీనివాసా ఏజెన్సీస్ ఎరువుల దుకాణంపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, ఏఈ అనిల్‌బాబు ఎరువుల దుకాణంలో సోదాలు నిర్వహించారు. స్టాకు నిలువకు, రిజిస్టర్‌లో ఉన్న స్టాకు వివరాల్లో తేడాలు గుర్తించారు. దీంతో 5.15 టన్నుల యూరియా, 14–35–14 ఎరువులను స్వాధీనం చేసుకుని షాపు యజమాని దండు గణపతిరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు. ఎరువులను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన



ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో సుమారు 2 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఆ భూమిని కొంతమంది ఆక్రమించుకుని వ్యవసాయం చేయకుండా అడ్డుకుంటున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి నారాయణమ్మ, ఆమె కుమారుడు నిరసన వ్యక్తం చేశారు. పురుగుల మందు డబ్బా పట్టుకుని ట్యాంక్ ఎక్కి ఆందోళనకు దిగారు. గత రెండేళ్లుగా కొంతమంది వ్యక్తులు తమను వ్యవసాయం చేయనివకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సుందర్ సింగ్, ఎస్సై చంద్రశేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పారు. ఆ భూములకు రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఆడుదాం ఆంధ్ర భారీ స్థాయిలో నిర్వహించాలి



ఆడుదాం ఆంధ్రాపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లా వ్యాప్తంగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జిల్లాలో 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అక్టోబరు 2 నుంచి నవంబరు 8 వరకు గ్రామ సచివాలయం నుంచి స్టేట్ లెవెల్ వరకు ఐదు విభాగాలలో పోటీలు నిర్వహించాలని.. విజేతలకు స్పోర్ట్స్ కిట్స్ ఉచితంగా ఇస్తారని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. గ్రామ సచివాలయం పోటీలలో విజేతలు మండల స్థాయిలో జరిగే పోటీలకు హాజరు కావాలన్నారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలో పోటీపడతారన్నారు. స్టేట్ లెవల్ పోటీలు నవంబరు 1 నుంచి 7 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తారని, విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలు 8న ముఖ్యమంత్రి అందజేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గౌతమ్‌రామ్(ఫైల్)



గౌతమ్‌రామ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెంటపాడు: మండలంలోని అలంపురం హైవే రోడ్డులో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన సరిపాటి గౌతమరామ్(22) ఏపీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. పనిమీద సోమవారం ఉదయం అమ్మమ్మ ఊరు రావిపాడు వచ్చాడు. మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన మధుశ్రీ గణేష్‌తో కలిసి అలంపురం హైవే వద్ద ఒక హోటల్‌లో భోజనం చేశాడు. తిరిగి రావిపాడు వెళ్తుండగా.. రావిపాడు నుంచి హైవే ఎక్కుతున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి లారీ కింద పడిపోయాడు. దీంతో గౌతమ్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మధుశ్రీ గణేష్‌కు తీవ్ర గాయాలు కాగా గూడెంలోని ఒక ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలం వద్ద మృతుడి బంధువుల రోదన కంటతడి పెట్టించింది. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ మూర్తి, ఎస్సై వీరభద్రరావు పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పెంటపాడు హెచ్‌సీ పాండురంగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

ఇరగవరం: ద్విచక్ర వాహనం దొంగిలించిన కేసులో నిందితుడికి తణుకు ఒకటో ఫస్ట్ ఏజెఎఫ్‌సీఎం కోర్టు జడ్జి పి.నాగ రంజిత్ కుమార్ 6 నెలలు జైలు శిక్ష విధించారని.. ఇరగవరం ఎస్సై కె.చంద్ర శేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం జూన్ 13న ఇరగవరానికి చెందిన వ్యక్తి గ్రామంలోని ఒక హోటల్ దగ్గర టిఫిన్ చేస్తు ఉండగా కోనసీమ జిల్లా కాట్రేనికోన గ్రామానికి చెందిన గాలిదేవర పెద్దిరాజు బైక్ చోరీ చేశాడు. ఈ కేసులో జూలై 7న ముద్దాయిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. వాదనలు విన్న కోర్టు 6 నెలలు శిక్ష విధిస్తు సోమవారం తీర్పు వెలువరించింది.

గ్లైసిల్ మందు విక్రయంపై కేసు



గ్లైసిల్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీకృష్ణసాయి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ మందును 39 లీటర్లు విజిలెన్స్ సీఐ యూజీ విల్సన్ స్వాధీనం చేసుకున్నారు.











సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి


సమావేశంలో నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.పట్టణంలోని విద్యుత్ డివిజన్ స్థాయి ఉద్యోగుల సమావేశం సోమవారం మాగంటి కల్యాణ మండపంలో జరిగింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగ రాష్ట్ర జేఏసీ నాయకులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం విద్యుత్ ఉద్యోగులందరికి ఆమోదయోగ్యంగా లేదని విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వంలో కుదుర్చుకున్న ఒప్పందం అయోమయంగా ఉందని, నిర్దిష్టమైన హామీలు లేవని ఆరోపించారు. 12 ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, వాటి హామీ లేకుండా కుదురుకున్న ఒప్పందం చెల్లదని తెలిపారు. ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు జేఎల్ఎం పే స్కేలు ఇవ్వాలని, పెండింగ్ డీఏలు రిలీజ్ చేయాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని తీర్మానం చేశారు. హామీలు వచ్చే వరకు ఎటువంటి సంతకాలు పెట్టరాదని రాష్ట్ర జేఏసీ నాయకులకు విన్నవించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, బి.రామకృష్ణ, బి.రాజేంద్రప్రసాద్, జి.గంగరాజు, బాలాజీ, గోవింద్, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీవీఆర్‌లో నేడు నెలవారీ సాహితీ, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీటీసీ): బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం జరుగుతుందని సభాధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. వివిధ పాఠశాలల చిన్నారులచే దేశభక్తి బృంద నృత్య పోటీలు, కళాకారులచే ట్రాక్ సింగింగ్, అనంతరం సభ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


తణుకు కోర్టులో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తణుకు అర్బన్: పట్టణంలోని తణుకు కోర్టు ప్రాంగణంలో సెప్టెంబరు 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాల్సిందిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎన్ రంజిత్‌కుమార్‌లు పోలీసు అధికారులకు సూచించారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం తణుకు కోర్టులో పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కక్షిదారులైన ఇరు వర్గాలతో చర్చించి రాజీ చేసుకునే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో తణుకు సీఐ సీహెచ్ ఆంజనేయులు, తణుకు, పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి, ఇరగవరం, పెరవలి, ఉండ్రాజవరం ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉపఎన్నికకు నామినేషన్ ప్రక్రియ పూర్తి

ఇరగవరం: మండలంలోని ఒక సర్పంచ్ స్థానానికి, ఒక వార్డు నెంబర్ స్థానానికి నామినేషన్, విత్ డ్రాల ప్రక్రియ పూర్తైందని ఎంపీడీవో, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. కావలిపురం సర్పంచ్ స్థానానికి వనచర్ల అప్పన్న స్వామికి మంచము గుర్తు, వనచర్ల సత్యవతికి కత్తెర గుర్తు కేటాయించడం జరిగిందన్నారు. గోటేరు గ్రామంలో ఒక వార్డుకి కొరువూరి ధనలక్ష్మికి ప్రెషర్ కుక్కర్, తోట ధన లక్ష్మికి గౌను, మెంటే రాధకి స్టూల్ గుర్తులు కేటాయించడం జరిగిందన్నారు. కావలిపురంలో ఒక వార్డుకి ఎన్నిక జరగవలసి ఉండగా దాకమూరి శ్రీను ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని తెలిపారు.

బడుల్లో విద్యార్థి వినియోగదారుల క్లబ్‌లు

సాక్షి, భీమవరం: పాఠశాల స్థాయిలో విద్యార్థి వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. సోమవారం భీమవరంలోని పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో విద్యార్థి వినియోగదారుల క్లబ్స్ ఏర్పాటుపై జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో వినియోగదారులు అనేక మోసాలకు, అన్యాయాలకు గురవుతున్నారని, అందువల్ల విద్యార్థి దశ నుంచే 8, 9 తరగతుల విద్యార్థులతో వినియోగదారుల క్లబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్‌లు ఉద్దేశాలు, లక్ష్యాల వంటివాటిపై సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది.

ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్షా కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



- ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు
- తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి.
- రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు
- ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి
- మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి
- స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు
- పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు
- దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి
- ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి
- దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

- పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం. సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



జీవామృతం

మోతాదు ఎంత?

- ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి
- మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి
- బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి
- మెటారైజియమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి
- హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి.
- కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి
- 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి
- లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి
- పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి
- అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).